క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ బుచ్చిబాబు

హిరమండలం: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు అన్నారు. హిరమండలం, సుభలయ ఆర్‌అండ్‌ఆర్ కాలనీల్లో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పనులను బుధవారం పరిశీలించారు. సర్పంచ్‌లు, కార్యదర్శుల ఆధ్వర్యంలో మురుగు కాలువలు, రక్షిత మంచినీటి ట్యాంకులు శుభ్రం చేయడం వంటి కార్యక్రమాలు జరుగుతన్నాయన్నారు. గ్రామాల మరింత పరిశుభ్రంగా ఉండాలంటే ప్రజల సహకారం అవసరమన్నారు. మేజర్ పంచాయతీ సహాయ కార్యదర్శి నర్సింగరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఎస్‌ఈబీ స్టేషన్ తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు ఎస్పీ గంగాధరం

నరసన్నపేట: స్థానిక ఎస్‌ఈబీ స్టేషన్ కార్యాలయాన్ని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, అదనపు ఎస్పీ డి.గంగాధరం బుధవారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఎన్నికల సమయంలో నమోదైన కేసుల విచారణను త్వరితగతిన పూర్తిచేయాలని స్థానిక సీఐ సతీష్‌కుమార్‌కు సూచించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరించాలని, అక్రమంగా ఇసుక తరలిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది ఉద్యోగ నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

పాతపట్నం: మండలంలోని ప్రహరాజపాలెం లో గల మసీద్‌లో బుధవారం భక్తిశ్రద్ధలతో మొహర్రం నిర్వహించారు. ఉపవాస దీక్షలను విరమించారు. అనంతరం బంధు మిత్రులకు ఖీర్‌ను పంచిపెట్టారు. మసీద్ గురువు మహమ్మద్ లుక్‌మాన్, ఫరీద్, ఫకీర్, హిబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు సహకరించాలి



కూరగాయల వ్యర్థాలను పరిశీలిస్తున్న సర్పంచ్

నరసన్నపేట: కూరగాయల, ఇతర వ్యర్థాలు రోడ్డుపైన, ఖాళీ స్థలాల్లో వేయవద్దని, పరిశుభ్రతకు సహకరించాలని సర్పంచ్ బూరల్లి శంకర్ కోరారు. స్థానిక కాలేజీ రోడ్డు, బజారు వీధుల్లో బుధవారం పంచాయతీ సిబ్బందితో కలిసి పర్యటించారు. వర్షా కాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున వ్యర్థాలను డబ్బాల్లో వేసి ఉంచితే పంచాయతీ సిబ్బంది వచ్చి సేకరిస్తారన్నారు. వ్యర్థాలు ఎక్కడికక్కడ కనిపించి దుర్వాసన వస్తుండటంతో కూరగాయల వ్యాపారులకు సూచనలు చేశారు. రోడ్డుపై వ్యర్థాలు వేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పట్టణంలో జ్వరాల తీవ్రత పెరుగుతుందన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

తులసీ దళార్చన



జగన్నాథ స్వామి

నరసన్నపేట: వేంకటేశ్వరాలయంలోని జగన్నాథస్వామికి రథయాత్ర ముగింపు సందర్భంగా తులసీ దళార్చన పూజలు బుధవారం నిర్వహించారు. శయన ఏకాదశి పురస్కరించుకుని ప్రత్యేక పూజాకార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్టుబడి సాయమేది?

- ఎదురుచూస్తున్న రైతులు
- ఏటా రూ.20 వేల అందిస్తామన్న హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలి
- ఇప్పటికే పీఎం కిసాన్ నిధులు జమ చేసిన కేంద్రం



హిరమండలం సమీపంలో వరి సాగు

నియోజకవర్గంలో రైతుల వివరాలు

మండలం	సాగుభూమి	రైతులు
పాతపట్నం	8,699	14,726
హిరమండలం	3,364	6,716
కొత్తూరు	10,374	13,914
మెళియాపుట్టి	7,741	12,235
ఎల్.ఎన్.పేట	4,464	8,487

హిరమండలం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పెట్టుబడి సాయం కోసం ఎలాంటి భరోసా అందక.. వ్యవసాయం ముందుకు సాగడం లేదు. దీనిపై ప్రభుత్వం ఎలాంటి భరోసా కల్పించడం లేదు. ఈ ఏడాది వ్యవసాయం ఎలా చేయాలో తెలియక సాయంకోసం ఎదురుచూస్తున్నారు. గతంలో పంటల సాగు కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సకాలంలో రైతు భరోసా కింద పెట్టుబడి అందించేది. ఈ ప్రభుత్వం 'అన్నదాత సుఖీభవ' పేరు పెట్టి ఏడా రూ.20 వేలు అందిస్తామని చెప్పింది. ఇప్పటివరకు ఎలాంటి ఆర్థికసాయం చేయక మొండి చేయి చూపుతోందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగు లక్ష్యం సాధించేనా?

పెట్టుబడి సాయం అందకపోవడంతో ప్రభుత్వం నిర్దేశించిన సాగు లక్ష్యం అధిగమించడం కష్టంగా ఉంది. పాతపట్నం నియోజకవర్గంలో 56078 మంది రైతులు ఈ ఏడాది ఖరీఫ్‌లో వరి పంటను సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో 35045 హెక్టర్లలో సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. రైతులు అప్పులు చేసి సాగు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. చాలామంది రైతులు వెద పద్ధతిలో సాగును ప్రారంభించారు. మరికొంతమంది నాట్లు వేసేందుకు సిద్ధం చేసుకుంటున్నారు. ప్రభుత్వం ఎటువంటి భరోసా కల్పించకపోవడంతో ఎలా సాగుచేయాలనే సందిగ్ధంలో ఉన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద రూ.2 వేలు రైతుల ఖాతాల్లోకి ఇటీవల జమ చేసింది. గతంలో పీఎం కిసాన్ నిధులతో పాటు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ముందస్తుగా రైతులకు సాయం అందించి ఆదుకుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులైనా రైతులకు సాయం అందించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎటువంటి ఆదేశాలు ఇవ్వలేదు..



రైతులకు పంటల సాగుకు పెట్టుబడి సాయంపై కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలి. మాకు ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదు. ఖరీఫ్‌లో వరి సాగు కోసం రైతు సేవా కేంద్రాల ద్వారా విత్తనాలు పంపిణీ చేయడం జరిగింది. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

– బి.సంధ్య, ఏఓ, హిరమండలం

ఇబ్బంది లేకుండా చూడాలి



నాకు ఎకరా భూమి ఉంది. వరి సాగు చేసున్నాను. సాగు ఖర్చులు పెరిగాయి. గత ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు ముందే పెట్టుబడి సాయం ఇచ్చేది. ఉచిత పంటల బీమా అమలు చేసేది. కొత్త ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకోవాలి. రైతులు వ్యవసాయ పనులు చేసుకునేందుకు ఇబ్బంది లేకుండా చూడాలి.

–బి.వెంకటరమణ, రైతు, తంప, హిరమండలం

అప్పు చేయాల్సి వచ్చింది



నాకు రెండెకరాల భూమి ఉంది. పంట సాగుకు పెట్టుబడిగా రూ.25వేల అవసరం. గతంలో పీఎం కిసాన్, రైతు భరోసా పథకాల కింద ఒకేసారి డబ్బులు ఇచ్చేవారు. దీంతో పెట్టుబడికి డబుబ్బలు వెతకాల్సిన అవసరం ఉండేదికాదు. ఇప్పుడు అప్పు చేసి పంట సాగు చేస్తున్నాం. ఎన్నికలప్పుడు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోవాలి. సకాలంలో సాయం అందజేస్తేనే మాకు మంచి జరుగుతంది.

– ఉకలాపు శ్రీనివాసరావు, రైతు, కిట్టలపాడు, హిరమండలం

వైశ్య సంఘ అధ్యక్షుడిగా పార్వతీశం



పార్వతీశంను అభినందిస్తున్న గోవిందరావు, సంఘ సభ్యులు

పాతపట్నం: మండలంలోని తెంబూరు పిర్క కళింగ వైశ్య సంఘం అధ్యక్షుడిగా పొట్నూరు పార్వతీశం, గౌరవ అధ్యక్షుడిగా పొట్నూరు గజపతిరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కళింగ వైశ్య రాష్ట్ర అధ్యక్షుడు బోయిన గోవిందరావు బుధవారం తెలిపారు. సంఘం ఉపాధ్యక్షుడిగా నందన శ్రీనివాసరావు, సెక్రటరీగా కొట్నీ తేజేశ్వరరావు, జాయింట్ సెక్రటరీగా ఎం.బుజ్జి, ట్రజరీగా పొట్నూరు తరుణ్ కుమార్, మెంబర్స్‌గా ఐదుగురిని ఎన్నికోవడం జరిగిందన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై చర్యలు



తొగరాం ఇసుక ర్యాంప్ వద్ద ట్రెంచ్ తవ్విస్తున్న రెవెన్యూ అధికారులు



కొత్తవలస ఇసుక ర్యాంప్ వద్ద ట్రెంచ్ తవ్విస్తున్న అధికారులు

ఆమదాలవలస: మండలంలోని నాగావళి నదీ తీర ప్రాంతాల్లో ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కె.వేణుగోపాల్ ఆదేశాల మేరకు ఆర్‌ఐ శిరీష, వీఆర్వో, వీఆర్‌ఏలు మండలంలోని కొత్తవలస, తొగరాం, దూసి, తోటాడ గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఆయా గ్రామాల పరిసరాల్లోని నాగావళి నది ఇసుక ర్యాంపులకు వెళ్లే రహదారులను గుర్తించారు. వాహనాలు రాకపోకలు సాగించకుండా జేసీబీలతో ట్రెంచ్‌లను తవ్వించారు. రాష్ట్ర ప్రభుత్వ నుంచి ఆదేశాలు వచ్చేవరకు ఎవరైనా ఇసుక తవ్వకం, రవాణా చేస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్‌ఐ శిరీష హెచ్చరించారు.

గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలి

పాతపట్నం: ఒడిశా నుంచి వస్తున్న గంజాయి అక్రమ రవాణాను అరికట్టాలని, యువత గంజాయికి దూరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కొత్తూరు సీఐ ఆర్.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని ఎస్ఐలతో బుధవారం శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పాతపట్నంలో ఇటీవల ఆలయాల్లో దొంగతనం జరుగుతుందని, రాత్రులు గస్తీ ఏర్పాటు చేయాలన్నారు. ఒడిశా సరిహద్దు ప్రాంతం కావడంతో గంజాయి రవాణా, వాడకంపై నిఘా పెట్టాలన్నారు. సీఐ వేణుగోపాలరావు మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వొద్దన్నారు. సమావేశంలో పాతపట్నం, కొత్తూరు, మెళియాపుట్టి, హిరమండలం ఎస్ఐలు మహమ్మద్ యాసీన్, ఎం.ఎ.హమ్మద్, రాజేష్, నారాయణస్వామి పాల్గొన్నారు.

నేటినుంచి కుష్టు వ్యాధి సర్వే



మాట్లాడుతున్న హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ

ఎల్.ఎన్.పేట: జాతీయ కుష్టు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా ఇంటింటా సర్వేను చేపట్టాలని హెల్త్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, ఈఓ విమలరావు అన్నారు. మండలంలోని మల్లికార్జునపురం గ్రామంలో బుధవారం కుష్టు వ్యాధి గుర్తింపుపై అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటా సర్వే చేపట్టాలన్నారు. మనిషి చరీరంపై ప్రత్యేకమైన మచ్చలు ఉంటే వారిని గుర్తించి తగిన పరీక్షలు నిర్వహించాలని అవగాహన కల్పించారు. స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించి వారికి ఉచితంగా మందులు ఇవ్వటం జరుగుతుందన్నారు. వైద్య సిబ్బంది ఎస్.కిరణ్ కుమార్, ఆరుద్ర తదితరులు పాల్గొన్నారు.

93 మందికి నేత్ర పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

పోలాకి: మండల కేంద్రంలోని సత్యసాయి అలయం ఆవరణలో బుధవారం శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించా. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సౌజన్యంతో 93 మందికి కంటి పరీక్షలు చేశారు. 32 మందికి శస్త్రచికిత్సల కోసం ఎంపిక చేశారు. డాక్టర్ నిఖిత, ఆప్తమాలిక్ ఆఫీసర్ రత్నంరాజు, క్యాంప్ మేనేజర్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు. శిబిరానికి వచ్చిన రోగులకు పోలాకి సత్య సాయి సేవా సమితి సభ్యులు భోజనాలు ఏర్పాటు చేశారు.

శాకంబరీ దేవిగా కన్యకాపరమేశ్వరి



కూరగాయల అలంకరణలో కన్యకాపరమేశ్వరి

ఆమదాలవలస: పట్టణంలోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని బుధవారం శాకంబరీ దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు వివిధ రకాల కూరగాయలతో కన్యకాపరమేశ్వరి దేవిని ప్రత్యేక అలంకరించి పూజలు నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీముఖలింగేశ్వరుని తిరువీధి



పూజలు అందుకుంటున్న స్వామివారు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రమైన శ్రీముఖలింగంలో బుధవారం రాత్రి ఆషాఢ మాసం శయన ఏకాదశి సందర్భంగా స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. విష్ణుమూర్తి నాలుగు నెలలు యోగ ముద్రలోకి వెళ్లి తరువాత కార్తిక మాసంలో మేల్కొంటారు. శ్రీముఖలింగేశ్వరునికి అభిషేకాలు, పూజలు చేశారు. పార్వతీపరమేశ్వరులను తిరువీధి నిర్వహించారు.

పశుగ్రాసం విత్తనాల పంపిణీ



పశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాడి రైతులు తమకున్న భూమిలో పది సెంట్లు పశుగ్రాసాన్ని సాగు చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పాడి రైతులకు ఏడీ కరుణాకరరావుతో కలిసి బుధవారం పాశుగ్రాసం విత్తనాలను పంపిణీ చేశారు. పాడి పశువులు ఎక్కువగా పెంచే రైతులు ఎకరం భూమిలో పశుగ్రాసాం సాగు చేసుకోవాలన్నారు. పశువుల షెడ్ల నిర్మాణం కోసం 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్ల నిర్మాణానికి 70 శాతం ప్రభుత్వం సబ్సిడీ అందిస్తుందన్నారు. పశువైద్యురాలు కె.మౌనిక, ఇప్పిలి ధనుంజేయరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సరుబుజ్జిలి: రొట్టవలస 11 కేవీ ఫీడర్ పరిధిలో శుక్రవారం మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు గురువారం ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మత్రిపాడు, బురిడివలస, దకరవలస, చిగురువలస సుభద్రాపురం, రొట్టవలస, పాలవలస, పెద్దపాలెం, పురుషోత్తపురం, అలమాజీపేట గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు.

బూర్జ మండలంలో..

బూర్జ: బూర్జ మండలంలో అన్ని గ్రామాల్లో సెక్షన్ ఫీడర్‌ల పరిధిలో ఉన్న తదితర ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ బుధవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొల్లివలస, మదనాపురం గ్రామాల్లో గల సబ్ స్టేషన్లలో నిర్వహణ పనులతోపాటు చెట్ల కొమ్మలు తొలగించడం , వాలిన విద్యుత్ స్తంభాలను సరిచేస్తామన్నారు.

ఆమదాలవలస మండలంలో..

ఆమదాలవలస: ఆమదాలవలస సబ్–స్టేషన్ 33/11 కేవీ పరిధిలో శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగిస్తామని విద్యుత్ శాఖ ఈఈ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పంతులుపేట, సోట్టవానిపేట, కె.మన్నయ్యపేట, టి.మన్నయ్యపేట, తురకపేట, చింతాడ, నందగిరిపేట, సనపలవనిపెట, నాదానపురం, తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. మండలంలోని తొగరం 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో గల జీకేవలస ఫీడర్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. నిమ్మతుర్లువాడ, జి.కె.వలస, కొరపం, చేపేనపేట, పాతూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

జలుమూరు మండలంలో..

జలుమూరు: అల్లాడ ఫీడర్‌లో నిర్వహణ పనులను శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చేపట్టనున్నట్లు ఏఈ వి.వెంకటేశ్వరరావు బుధవారం తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలో గల కరవంజ, పాగోడు, గొటివాడ, సైరిగాం, అంధవరం తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

నరసన్నపేట మండలంలో..

నరసన్నపేట: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు ఇతర నిర్వహణ పనుల శుక్రవారం చేపనున్నట్లు ఈఈ జి.శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి 10 గంటల వరకు నరసన్నపేట, జమ్ము, సత్యవరం, తామరాపల్లి, బొరిగివలస,కరగాం, కంబకాయ, గొట్టిపల్లి, దూకులపాడు, ఈదులవలస కూడలి, చల్లబంద, కేపీ వలస,జడూరు మాకివలస, చీడివలస, పిరువాడ తదితర గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. నరసన్నపేట టౌన్ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పాతపట్నంలో భారీ వర్షం



పాతపట్నంలో వర్షం కురుస్తున్న దృశ్యం

పాతపట్నం: పాతపట్నం పరిసర గ్రామాల్లో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మూడు గంటల పాటు భారీ వర్షం కురవడంతో పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి. అచ్చుతాపురం, ప్రహరాజపాలెం, కొదూరు, గోపాలపురం, బూరగాం, కొరసవాడ, సీది, ఆర్.ఎల్.పురం, సరాలి తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పాతపట్నంలో భారీ వర్షం కురవడం వల్ల సుమారు గంట సమయం వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

పచ్చిరొట్ట ఎరువులతో మేలు



పచ్చిరొట్ట పొలాలను పరిశీలిస్తున్న పైడి కూర్మారావు

ఆమదాలవలస: రైతులు తమ పంట పొలాల్లో వేసిన పచ్చిరొట్ట ఎరువులు ప్రకృతి వ్యవసాయానికి ఉపయోగంగా ఉంటుందని వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో స్వయం సహాయక సంఘం సభ్యులు సాగు చేస్తున్న పచ్చిరొట్ట ఎరువులను బుధవారం పరిశీలించారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాల్లో కొంతమంది ఔత్సాహిక మహిళా రైతులు తమ పొలంలో పచ్చిరొట్ట ఎరువులతో ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు తెలిపారు. పచ్చిరొట్ట ఎరువులను భూమిలో కలియదున్నడం ద్వారా కుళ్లి భూమి సారవంతం అవుతుందన్నారు. రసాయన ఎరువులు వినియోగించకుండా పంటలు బాగా పండుతాయన్నారు. రైతుకు లాభదాయకంగా ఉంటుందన్నారు.

నేడు మండల సమావేశం

ఎల్.ఎన్.పేట: ఈ నెల 18న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ గిరిబాల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి అధ్యక్షతన సమావేశం ఉదయం 10:30 గంటలకు ఉంటుందన్నారు. అన్నిశాఖల అధికారులు సమగ్ర సమాచారంతో రావాలన్నారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలన్నారు.

గోతులమయం..



అద్వానంగా ఉన్న ముంగెన్నపాడు రోడ్డు

ఎల్.ఎన్.పేట: మండలంలోని ముంగెన్నపాడు గ్రామానికి వెళ్లే రోడ్డు అద్వానంగా మారిపోయింది. అలికాం–బత్తిలి ప్రధాన రహదారి నుంచి ముంగెన్నపాడు గ్రామం వరకు మూడు దశాబ్దాల క్రితం సుమారు కిలో మీటరు మేర తారు రోడ్డు వేశారు. అప్పటి నుంచి ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవటంతో రోడ్డు గోతుల మయంగా మారింది. రోడ్డుపై రాళ్లు తేలడంతో ద్విచక్ర వాహనంపై వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

మనసు పెడితే మంచి ఫలితాలు



నగదు బహుమతులు అందజేస్తున్న కంచరాన రోహన్

మెళియాపుట్టి: మనసు పెట్టి చవిదితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని భోగాపురం సబ్ రిజిస్ట్రార్ కంచరాన రోహన్ అన్నారు. తన మామ దుప్పల అంజనేయమూర్తి (పలాస జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేశారు) జ్ఞాపకార్థ బుధవారం కరజాడ పాఠశాలలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన దాసరి సూర్యకుమార్‌కు మొదటి బహుమతిగా రూ.15 వేలు నగదు అందించారు, ద్వితీయ బహుమతి బొండాడ మధుసూదన్‌కు రూ.10 వేలు, తృతీయ బహుమతిగా మల్లారెడ్డి ధర్మతేజ, పల్లి జ్యోత్స్నలకు చెరో రూ.5 వేలు అందజేశారు. విద్యార్థులను మెమొంటోలతో సత్కరించారు. ఆంజనేయమూర్తి విగ్రహానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం శ్రీరాములు, ఐటీఐ ప్రిన్సిపాల్ జవహర్, జిల్లా కన్జ్యూమర్ క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్వీ చలం, మాజీ ఎంపీటీసీ దువ్వాడ బాలరాజు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.